

# సూర్య

www.suryaa.com

**ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా**

బుధవారం,20 ఆగస్టు 2025

8 పేజీలు


# సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమను ఆదుకోవాలి

**- కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌తో కేంద్ర మంత్రి వర్మ సమావేశం**



**న్యూఢిల్లీ,మేజర్‌న్యూస్** :అమెరికా ప్రభుత్వం ఇటీవల విధించిన 25శాతం సుంకం కారణంగా భారతీయ సముద్ర ఆహార ఎగుమతి పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితి నుంచి గట్టెక్కడానికి తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని భారత సముద్ర ఆహార ఎగుమతిదారుల సంఘం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.కేంద్రఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో ఎస్ఇఎఐ అధ్యక్షులు పవన్ కుమార్, సీఈవో డాక్టర్ రాఘవన్, జాతీయ కమిటీ సభ్యులు ఇర్రింకి గంగారాం, పూజితతోపాటు ఎంపీలు సానా సతీష్ బాబు,బీద మస్తాన్ రావు మంగళవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను పార్లమెంట్‌లోని ఆమె కార్యాలయంలో కలిసి ఆమెకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అమెరికా ఇటీవల విధించిన 25శాతం సుంకం,అదనంగా ఉన్న కౌంటర్ వేలింగ్ డ్యూటీ , యాంటీ డంపింగ్ డ్యూటీల కారణంగా భారతీయ ఎగుమతిదారులు దాదాపు 35శాతం సుంకం భారాన్ని మోయవలసి వస్తోందని ఎస్ఇఎఐ ప్రతినిధులు వివరించారు.ఈ పరిణామం వల్ల భారతీయ ఎగుమతులు భారీగా తగ్గుతున్నాయని, దీని ప్రభావం 2.8 కోట్ల మంది మత్స్యకారులు, రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల కార్మికుల జీవనోపాధిపై పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద సముద్ర ఆహార ఎగుమతిదారుగా ఉందని.ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఎస్ఇఎఐ అధ్యక్షులు పవన్ కుమార్ కోరారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కొన్ని ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కోవిడ్ -19 సమయంలో మాదిరిగా, ఎగుమతిదారులకు వారి వర్కింగ్ క్యాపిటల్‌లో 30శాతం వరకు తక్కువ వడ్డీతో (5శాతం లోపు) సాఫ్ట్ లోన్లు అందించాలి అని,అన్ని రకాల సముద్ర ఆహార ఎగుమతిదారులకు 240రోజుల పాటు ఎగుమతి సంబంధిత క్రెడిట్ సౌకర్యాలను పొడిగించాలి అని కోరారు. కాగా మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పామాయిల్ రైతుల ప్రయోజనాలు కాపాడాలి

**: ఎంపీ మహేష్**



**ఏలూరు/ఢిల్లీ,మేజర్‌న్యూస్** : దేశీయ రిఫైనింగ్ పెరిగేలా, వినియోగదారులకు ధరలు తగ్గేలా చూస్తూ, రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చూడటం కోసమే ముడి పామాయిల్ పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం జరిగిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద వెల్లడించారు. పామాయిల్ సహా క్రూడ్ వంట నూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల ఆయిల్ పామ్ రైతులపై పడుతున్న ప్రభావం గురించి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్ సభలో కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానం ఇచ్చారు. గతంలో తీసుకొచ్చిన డైనమిక్ ఇంపోర్ట్ డ్యూటీ విధానంలో కొన్ని లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేస్తున్నామని, అదే సమయంలో భారతదేశం తన వంట నూనెలలో సుమారు 60శాతం దిగుమతులపై ఆధారపడి ఉండటం వల్ల, అంతర్జాతీయ మార్కెట్ రేట్లకు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయని మంత్రి చెప్పారు. సోయాబీన్, పామ్ ఆయిల్ వంటి నూనెలపై బిసిడి తగ్గించడం ద్వారా, వంట నూనెల ధరలపై ఉన్న ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గించడం, దేశీయ రిఫైనరీల వినియోగాన్ని

- తరువాయి 2లో..


# స్పిల్వే వద్ద గోదావరి ఉధృతి



**పోలవరం,మేజర్‌న్యూస్:** పెరుగుతున్న గోదావరి నీటిమట్టం. భద్రాచలంవద్ద 37.10 అడుగులు. పోలవరం నుండి 6,42,370 క్యూసెక్కులు విడుదల అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి అనూహ్య రీతిలో పెరిగింది. ఎగువ రాష్ట్రాలనుండి కడెం, మంజీర, హరిద్ర, ఇంద్రావతి, శబరి, సీలేరు,మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని ఉపనదుల వరద జలాలు, కొండవాగుల జలాలతో నీటిమట్టం భారీగా పెరుగుతూ వస్తు ంది. భద్రాచలం వద్ద సాయంత్రానికి 36.00 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు స్పిల్వేలోకి అదనంగా వస్తున్న 8,00,702 క్యూసెక్కుల జలాలను జల వనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 31.720 మీటర్లు స్పిల్వే దిగువన 23.150 మీటర్లు నమోదయినట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

# వేగవంతంగా పీఎం లంకలో సముద్రపు కోత రక్షణ గోడ నిర్మాణం

**- పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**




**భీమవరం,మేజర్ న్యూస్** : జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామం పి.ఎం లంకలో డెలాయిట్ కంపెనీ సిఎస్ఆర్ ఫండ్స్ రూ.13.75 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన రక్షణ గోడ ప్రాజెక్ట్ ప్రస్తుత పురోగతి, గ్రామం వైపు 700 మీటర్ల భూమి క్లియరెన్స్‌కు అనుమతి, కాంట్రాక్టర్ ద్వారా ఇసుక అండ్ బండరాళ్ల సేకరణ, పీఎం లంక గ్రామంలో ఇటీవల

- తరువాయి 2లో..

# నీట మునిగిన కనక్కాయలంక కాజ్ వే



**యలమంచిలి,మేజర్‌న్యూస్** : వశిష్ట గోదావరి నదికి వరద నీటిమట్టంపెరిగిన నేపద్యలో మంగళ వారం మండలంలోని కనక్కాయ లంక కాజ్‌వే నీట మునిగింది. దీంతో ప్రయాణకుల రాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది.కనక్కాయలంక గ్రామ ప్రజలు కోనసీమ జిల్లా చాకలిపాలెం ,రాజోలు వైపు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కాజ్‌వేపైసుమారు మోకాలు లోతు వరదనీరు చేరింది. ఇక రేపటి నుంచి కాజ్‌వే దాటడానికి పడవ ప్రయాణం తప్పదని స్థానికులు చెబుతున్నారు.

# పార్లమెంటరీ కమిటీలలో సభ్యులుగా ఎంపి పాక సత్యనారాయణ



**భీమవరం,మేజర్‌న్యూస్** : రాజ్యసభ సభ్యులు, బిజెపి క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు, న్యాయవాది పాక వెంకట సత్యనారాయణ పార్లమెంటరీ కమిటీ వివిధ కమిటీల సభ్యులుగా నియమితులయ్యారు. ప్రధానమంత్రి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ,ప్రజా పంపిణీ కోసం సంప్రదింపుల కమిటీ సభ్యునిగా ఎంపీపాక వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ కమిటీతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం,అడవుల స్టాండింగ్ కమిటీ సభ్య సభ్యునిగా కూడా ఎంపీ నియమితులయ్యారు.

ప్రధాన మంత్రి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ రెండు కమిటీల్లోను బీసీ నాయుకులు,ఎంపీపాక వెంకట సత్యనారాయణకు అవకాశం కల్పించడం విశేషం అని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

**– 14 మంది సీనియర్ ఫోటోగ్రాఫర్లను సత్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు**




**భీమవరం,మేజర్ న్యూస్ :** గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలేనని, కెమెరా సృష్టికర్త లూయిస్ దాకురే కెమెరా కనుగొనకపోతే చరిత్రకు చిహ్నాలు లేవని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం ఏరియా ఫోటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఫోటోగ్రఫి ప్రాముఖ్యత సంతరించుకుందని, భీమవరం ఏరియా ఫోటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అద్వితీయమని, కెమెరా లేని భవిష్యత్ సమాజానికి చరిత్ర తెలియదని అన్నారు. ఫోటో గ్రాఫర్లకు ప్రభుత్వం ద్వారా నా పరిధిలో సహకారాలు అందిస్తామని అన్నారు. అసోసియేషన్ సభ్యులు రామాయణం శివ, ఘంట చంటి, ఘంట గణేష్, కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి శుభకార్యానికి అన్ని వర్గాల వారికి ఫోటోగ్రాఫర్లు అవసరమని, వారి జీవితాల్లో మాత్రం వెలుగులు లేవని, అటువంటి ఫోటోగ్రాఫర్ల అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని, ఫోటోగ్రాఫర్స్ జీవితాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఫోటోగ్రాఫర్స్ లకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందించాలని కోరారు. అనంతరం 14 మంది సీనియర్ ఫోటోగ్రాఫర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్లు ముక్కు సింహాద్రి, ఎస్ నాగు, శ్రీమన్నారాయణ, చెక్కు శ్రీరామమూర్తి, బాపిరాజు, కృష్ణంరాజు, బుజ్జి, అరసవల్లి సుబ్రమణ్యం, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపడా ఎరువుల లభ్యత

**– అన్నదాత సుఖీభవ అర్హత కలిగిన ప్రతీ రైతుకు అందాలి**
**– వ్యవసాయాధికారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఎటువంటి కొరత లేదన్న విషయాన్నీ ప్రతీ రైతుకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఎరువుల లభ్యత, అన్నదాతా సుఖీభవ అంశాలపై జిల్లాలోని వ్యవసాయాధికారులతో మంగళవారం జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత వ్యవసాయ సీజన్ కు అవసరమైన ఎరువులు, డిఏపి నిల్వలు ఉన్నాయని, ఎటువంటి కొరతా లేదన్న విషయాన్నీ గ్రామా స్థాయిలోని వ్యవసాయాధికారులు రైతులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఎరువులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని,ఎవరైనా డీలర్లు ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అధిక ధరలకు అమ్మినా వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అన్నదాతా సుఖీభవ పథకంలో పెండింగ్ ఉన్న రైతుల ఈ కెవైసి వెంటనే పూర్తిచేయాలని, రైతులనుండి అందిన అభ్యంతరాలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వెబ్ లాండ్‌లో తప్పుగా నమోదు అయిన ఆధార్ రైతులు పేరు సరిచేయడం ,చనిపోయిన రైతుల భూమి వారి కుటుంబంలో మ్యూటేషన్ సమస్యలను వెంటనే పరిష్కరించి అర్హత కలిగిన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ లబ్ది పొందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# దీన దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పరీక్షలకు దరఖాస్తులు

**ఏలూరు,మేజర్ న్యూస్ :** తపాలా శాఖ దీన దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీకర్ బాబు తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు అర్హులని, దీనికి దరఖాస్తు చేయడానికి సెప్టెంబర్ నెల 16 చివర తేదీఅని తెలిపారు.

దీన దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్ షిప్ పరీక్షకు హాజరు అయ్యేవిద్యార్ధికి ఫిలాటెలి అకౌంట్ లేదా సంబంధిత స్కూల్ ఫిలాటెలి క్లబ్ మెంబర్ అయి ఉండాలన్నారు. ఈ పరీక్ష రెండు స్థాయిల్లో నిర్వహించబడు తుందన్నారు. మొదటి స్థాయి పరీక్షా విధానంలో 50 బహుళ ఎంపిక ప్రశ్నలు ఉంటాయని,ప్రతి ప్రశ్నకు 1 మార్కు ఉంటుందన్నారు.నెగటివ్ మార్కింగ్ ఉండదన్నారు. ఈ 50 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్ మరియు ఫిలాటెలీ కి సంబంధించినవి ఉంటాయన్నారు. మొదటి స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైనవారు రెండవ స్థాయిలో ఫిలాటెలి ప్రాజెక్ట్ సమర్పించాలన్నారు. ఈ ప్రాజెక్ట్ అంశాన్ని మొదటి పరీక్షా ఫలితాలు విడుదల తదుపరి తెలియజేయబడతాయన్నారు. రెండవ స్థాయిలో ఉత్తీర్ణత సాదించిన విద్యార్థులకు, ప్రతి త్రైమాసికం రూ.15వందల చొప్పున సంవత్సరానికి రూ.6వేలు స్కాలర్ షిప్ ను నేరుగా విద్యార్థులకు సేవింగ్స్ ఖాతాలకు జమ చేయబడుతుందన్నారు.

# కరెంట్ షాక్‌తో పిట్టల్లా రాలిపోతున్న పామాయిల్ కార్మికులు




**ఏలూరు,మేజర్ న్యూస్ :** పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి రామకృష్ణ డిమాండ్ చేశారు మంగళవారం పామాయిల్ కార్మిక సంఘం ,ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం పామాయిల్ కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పదివేలు మందికి పైగా పామాయిల్ కార్మికులు పామాయిల్ తోటలలో పనిచేస్తున్నారని తెలిపారు. తోటల్లో పనిచేస్తున్న సందర్భంలో పామాయిల్ గెలలు కోయడం, లోడ్ చేయటం,ఫ్యాక్టరీల వద్ద అన్లోడ్ చేయటం వంటి పనులు చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కాలంలో విద్యుత్ షాక్ తగిలి, విషపురుగులు కాటేసి చనిపోవడం వికలాంగులుగా మారటం జరుగుతుందన్నారు. ఏలూరు ఎంపీ పామాయిల్ రైతుల గురించి మాట్లాడుతున్నారు తప్ప పామాయిల్ తోటలో పనిచేస్తూ పొట్ట నింపుకొని కష్టపడుతున్న కార్మికుల గురించి మాట్లాడుకోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే జిల్లాలో జంగారెడ్డిగూడెం, టీ నర్సాపురం, జీలుగుమిల్లి, చింతలపూడి, కామవరపుకోట, పెదవేగి, లింగపాలెం మండలాల్లో పామాయిల్ కార్మికులు విద్యుత్ శాఖ తగిలి ప్రాణాలు కోల్పోయిన అధికారులు కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ మూడు శాఖల అధికారులు మనుషులు చనిపోతే పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం.సత్యనారాయణ,హరీష్, ఎం.లక్ష్మణ, ఎం రాంబాబు, టీ.సుబ్బారావు, జి.రమేష్, ఎం శ్రీను, అర్జునా, జి యేసు రాజు తదితరులు పాలొగొన్నారు.

# పామాయిల్ రైతుల ప్రయోజనాలు కాపాడాలి

మొదటిపేజీ తరువాయి

పెంచడం, స్థానిక వంట నూనె రిఫైనింగ్ పరిశ్రమను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద వెల్లడించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్ కింద,ఆయిల్‌పామ్ ఎక్కువగా పండిస్తున్న ఏలూరు జిల్లాతో సహా ఆంధ్రప్రదేశ్ లోని ఆయిల్ పామ్ రైతులకు సమగ్ర మద్దతు ప్యాకేజీ అందిస్తున్నామని, ఇందులో మొక్కలు నాటడం, అంతర పంటల ప్రోత్సాహం, నీటిపారుదల, యాంత్ర సామగ్రి అందించడం,నర్సరీలు, విత్తన తోటలు, ప్రాసెసింగ్ మిల్లులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ఆర్థిక సహాయం అందించటం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని మంత్రి చెప్పారు.

# వేగవంతంగా పీఎం లంకలో సముద్రపు కోత రక్షణ గోడ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

నిర్మించిన రహదారిని ముందస్తుగా ఉపయోగించడానికి అనుమతి,పీఎం లంక గ్రామ తీరప్రాంతం నుండి ఇసుక వాడకంపై పై స్టీరింగ్ కమిటీ సభ్యులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సముద్రపు కోత నిరోధక అడ్డుకట్ట అక్టోబర్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పనులను ప్రారంభించడం జరిగిందని, కానీ నిర్మాణ పనుల్లో అనుకున్నంత పురోగతి లేదన్నారు. దీనిపై కంపెనీ ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. స్టీరింగ్ కమిటీ సభ్యులకు పలు ఆదేశాలు జారీ చేశారు. జియో టెక్స్టైల్ ట్యూబ్ సీవాల్" (సముద్రపు రక్షణ గోడ) నిర్మాణ పనులను నిర్ణీత గడువులోపుగా పూర్తి చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టి రావాల్సిందిగా సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్లో హర్యానా గుర్గావ్ నుండి డిలైట్ కంపెనీ సీనియర్ కన్సల్టెంట్ అభయ్ వర్మ, నరసాపురం ఆర్డీవో దాసిరాజు,జిల్లా జల వనరుల శాఖ అధికారి సత్యనారాయణ, స్టీరింగ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి హరివాన సేవా కార్యక్రమం





**ఏలూరు,మేజర్ న్యూస్ :** శ్రావణమాసం ఏకాదశి మంగళవారం పర్వదినం సందర్భంగా. తూర్పువీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి కోవెలలో నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్–ఎస్ఎంఆర్ పెదబాబు. దంపతులచే మంగళవారం సాయంత్రం గరుడ వాహనముపై ప్రాకారోత్సవము.


అనంతరం హరివానసేవా కార్యక్రమం నిర్వహిం చారు. ఉదయం స్వామివారికి,శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి పంచా మృత, క్షీరాభిషేకము అనంతరం సుదర్శన హోమాం నిర్వహించారు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమాల వలన నగరం సస్యశ్యామలంగా ఉంటుందని ఆలయ అర్చకులు వివివి రామానుజా చార్యులు తెలిపారు. టెంపుల్ ఇన్చార్జ్ గోపాల్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కనుల విందుగా తిలకించి.స్వామి వారి ఆశీస్సులు పొంది.తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# శ్రీ రామాలయం కమిటీ చైర్మన్‌కు ఎస్ఎంఆర్ శుభాకాంక్షలు

**ఏలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న శ్రీ రామాలయం కమిటీ చైర్మన్ కుర్నాని గోవింద్,పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారంత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు.

ఈ కార్యక్రమంలో అమరావతి అశోక్,మంచమ్ మహిబాబు, ఈవో సిహెచ్ చిన్ననాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పాలకవర్గాన్ని అభినందించిన ప్రభుత్వ విప్ నాయకర్



**మొగల్తూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని కే.పీ. పాలెం సౌత్ గ్రామం వడ్లవానిపాలెం సహకార సంఘ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీ నాయకులు వలవల శేషారావు (బాబులు), కమిటీ సభ్యులుగా కొయ్యకృష్ణ (బిజెపి), కొండేటి సత్యనారాయణ (టిడిపి) సంఘ కార్యాలయంలో మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్. స్థానిక శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, డీసీఎంఎస్ అధ్యక్షుడు చాగంటి మురళీకృష్ణ (చిన్న), పాల్గొని ప్రమాణ స్వీకారం చేసిన సంఘ చైర్మన్ వలవల శేషారావు (బాబులు), కమిటీ సభ్యులు కొయ్య కృష్ణ, కొండేటి సత్యనారాయణ లను అభినందించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ శాసనసభ్యుడు బండారు మాధవ నాయుడు, నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు,గ్రామ సర్పంచ్ అందే వెంకటలక్ష్మి, ఎంపీటీసీ అందే దొరబాబు, కే.పీ.పాలెం నార్త్ సర్పంచ్ కడలి సోంబాబు, ఉప సర్పంచ్ బెల్లపు కొండ నాని, ఎంపీటీసీ దొంగ సత్యనారాయణ, వలవల నాని,మొగల్తూరు నీటి సంఘం అధ్యక్షుడు కడలి మోహన్రావు, మొగల్తూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి రాంబాబు, గుండా బత్తుల నారాయణరావు, జనసేన పార్టీ నాయకులు కుమ్మరి పురుగు రాంబాబు, కునపురెడ్డి గోవింద రాజులు,అల్లం మెహర్ బాబా, బొడ్డు త్రిమూర్తులు, కందులపాటి ముత్యాలరావు, అల్లా ముక్తేశ్వరావు, అల్లం పెద్దరాజు, టిడిపి నాయకులు చిన్నమిల్లి రాధా, కుమ్మరి పురుగు తాతాజీ, బిజెపి నాయకులు దొంగ నరసింహారావు, కందులపాటి మూల స్వామి, తదితరులు"శుభాకాంక్షలు" తెలిపారు.

## పంట పొలాలను పరిశీలించిన అధికారులు



నరసాపురంరూరల్, మేజర్‌న్యూస్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం, ప్రాంతీయ వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. దర్భరేవు డ్రైన్ న్ సందర్శించి సంబంధిత శాఖల అధికారులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. పొలాలలోని నీరును వీలైనంత త్వరగా బయటకు వెళ్లే మార్గాన్ని చేసుకోవాలని రైతులకు సూచించారు.అలాగే ఎకరానికి 10 - 15 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ ఎరువులు బుస్టర్ డోస్‌గా నీరు తీసిన తర్వాత వేసుకోవాలనిఅన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నరసాపురం డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు,ఎలమంచిలి మండలాల రైతు సేవ కేంద్ర సిబ్బందికి మూడు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. మొదటి రోజుగా లక్ష్మణే శ్వరంలో శిక్షణ ఇచ్చారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం లక్ష్మనేశ్వరం, వేములదీవి గ్రామాలలో నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు పివి యన్ఎస్‌పి ప్రసాద్, డాక్టర్ మల్లికార్జున్ రావు, డిపిఎం నూకరాజు, మండల వ్యవసాయ అధికారులు అడబాల జోషిల, అబ్దుల్ రహీం, బాలా త్రిపుర సుందరి,వ్యవసాయ శాఖ, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది, రైతులు బాలం నాగభూషణం, దివి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## పెనుమంట్రలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవం



**పెనుమంట్ర, మేజర్ న్యూస్** :పెనుమంట్ర గ్రామం లో ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవం కార్యక్రమాన్నీ పెనుమంట్ర ఏరియా ఫోటోగ్రాఫర్స్ వీడియోగ్రాఫర్స్ ఘనంగా నిర్వహించారు, ఫోటో గ్రాఫి సృష్టి కర్త లూయిస్ జాక్వస్ మండ్ డాగురే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు,అయన వేసిన బాటలో నేడు ఫోటో గ్రాఫి అనేకమందికి జీవనోపాధిగా మారింది అని స్థానిక ఫోటో గ్రాఫి యూనియన్ తెలిపారు,ఈకార్యక్రమానికి యూనియన్ ప్రెసిడెంట్, సత్తి హరినాథ్ రెడ్డి, సెక్రటరి,ట్రెజరర్, పెచ్చెట్టి సూర్యచంద్ర, మాజీ ప్రెసిడెంట్ షబ్బీర్, ఎన్.శేఖర్, కె.రాజేష్, ఆర్.శివ, జి. పని, శివనాగేంద్రరెడ్డి, ఈశ్వరరెడ్డి, సత్యనారాయణ, బి.కృపావరం, జె.స్టాలిన్, గిరిరెడ్డి, కె. శ్రీను, కుక్కల రవి స్టూడియో అధినేతలు పాల్గొన్నారు.

## ఫేస్ -1,ఫేస్ -2 రీసర్వే నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి**



**భీమవరం:**జిల్లా కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం రీసర్వే, గ్రామాల సరిహద్దుల నిర్ధారణ, జాయింట్ ఎల్.పి.ఎంలు ప్రగతిపై రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు మండల సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్ వన్-1 లో పూర్తి కావాల్సిన ఐదు గ్రామాలలో రీ సర్వే పనులను వచ్చే శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫేస్-2లో జరుగుతున్న 27 గ్రామాలకు సంబంధించి ప్రతి భూస్వామికి 9(2) నోటీసు అందించాలన్నారు. ఇంకను రీసర్వే చేయవలసిన 72 గ్రామాల గ్రామ సరిహద్దులను రెండు రోజుల్లోగా నిర్ధారించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వ భూములకు ముందుగా గుర్తించాలన్నారు. భూమి సరిహద్దు సమస్య దరఖాస్తులు, ఆన్లైన్ సబ్ డివిజన్ దరఖాస్తులు, పిజిఆర్ఎస్ లో అందిన దరఖాస్తుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వ జాయింట్ ఎల్పిఎం సేవ రుసుము 500 రూపాయలను రద్దు చేయడం జరిగిందని, జాయింట్ ఎల్ పి ఎంలు కలిగిన రైతులు అందరికీ ఈ విషయాన్ని తెలియపరచి వెంటనే వారితో జాయింట్ ఎల్పిఎం దరఖాస్తులు తీసుకోవాలన్నారు. వచ్చే వారంలోగా సమస్యల పరిష్కారంపై ప్రగతి చూపించని వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, తహసిల్దార్లు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వై యస్స్ పాలెం సచివాలయాన్ని పరిశీలించిన డి.ఎల్.డి.ఓ జి. రాణి

నర్సాపురం రూరల్, మేజర్‌న్యూస్ : మండలంలోని య ర్రం శెట్టి



వారి పాలెం గ్రామ సచివాలయం, జిల్లా పరిషత్ హై స్కూల్ ను డిఎల్‌డిఓ జి రాణి మంగళవారం పరిశీలించారు."వర్క్ ఫర్ హోమ్ - సౌమిత్వ సర్వే ప్రోగ్రాం" పై సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "వర్క్ ఫర్ హోమ్" కార్యక్రమం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఒక మంచి పథకం అని పేర్కొన్నారు. అలాగే, సౌమిత్వ సర్వే ద్వారా ప్రతి ఇంటి యజమానికి సరైన డాక్యుమెంటు అందజేయబడుతుందని వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్‌ను పరిశీలించి మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయడానికి అంగీకరించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన ఏర్పాట్లను కూడా పరిశీలించి ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎర్రంశెట్టి బాబులు, స్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీ కోలపర్తి శ్రీనివాస్, సచివాలయం సెక్రటరీ జి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుడు క్రొవిడి ప్రసాద్‌కు పద్దం వెంకటకృష్ణ ఆర్థిక సహాయం

**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:** సీనియర్ పాత్రికేయుడు స్టేట్ టైమ్స్



రిపోర్టర్ ప్రసాద్‌కు ఆదివాసి సేన నాయకులు పద్దం వెంకటకృష్ణ 5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. రిపోర్టర్ క్రొవిడి ప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో విజయవాడలోనే ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అంబేద్కర్ యూత్ ద్వారా విషయం తెలుసుకున్న ఆదివాసి నాయకులు పద్దం వెంకటకృష్ణ తక్షణమే ఐదు వేలు ఫోన్ పే ద్వారా ప్రసాద్ కు అందజేశారు. ఇంకా ఏదైనా సహాయం కావాలంటే చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే అంబేద్కర్ యూత్ తరపున మరికొందరు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న తనకు ఆర్థిక సహాయం చేసిన శాసన సభ్యులు చిర్రి బాలరాజు కు, పద్దం వెంకటకృష్ణకు అంబేద్కర్ యూత్ కి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని ప్రసాద్ పేర్కొన్నారు.

## పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**- జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ**





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి కొడాలి అనురాధ సిబ్బందిని ఆదేశించారు. ముదినేపల్లి మండలంలోని పెయ్యేరు , కాకరవాడ గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ స్వామిత్వ సర్వే ప్రక్రియను, కొలతల సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పెద్దల విన్నపాలను సత్వరం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని , వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్వామిత్వ సర్వే అన్ని గ్రామాల్లో త్వరతిగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప మండల పరిషత్ అధికారి బూరేపల్లి అశోక్ , గ్రామపంచాయతీ కార్యదర్శులు జి రమేష్, బి జక్రయ్య , ఇంజనీరింగ్ అసిస్టెంట్లు , సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# చరిత్రను సజీవంగా నిలిపేదే ఫోటో





**ఒక్క క్లిక్..ఒక్క ఫోటో మనసును కదలిస్తూ హృదయాన్ని బంధిస్తూ జ్ఞాపకాలను అందిస్తూ చరిత్రలో సజీవంగా నిలుస్తుంది**

**కైకలూరు, మేజర్‌న్యూస్:** స్థానిక కైకలూరు మండలంలోని ఫోటోగ్రాఫర్స్ అందరూ కలిసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న స్టేషన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు,ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో మారుతున్న టెక్నాలజీని అందుకోలేక ఎంతో మంది జీవనాధారం కోల్పోతున్నారని అటువంటి వారికి ప్రభుత్వం రాయితీ మీద కెమెరాలు అందించి వృత్తి నైపుణ్య వర్క్ షాపులు ప్రభుత్వం ఏర్పాటు చేసి నైపుణ్యత సాధించే చర్యలు చేపట్టాలని కోరారు. తమ వంతుగా యూనియన్ మరియు సీనియర్ ఫోటోగ్రాఫర్ల సహకారంతో రానున్న కాలంలో కైకలూరు నియోజకవర్గ స్థాయిలో ప్రముఖ కంపెనీల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తానని అన్నారు. సంఘ గౌరవ అధ్యక్షులు కె. శ్యామ్ సువర్ణ రావు మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాల వృత్తులకు అందిస్తున్న సహాయాన్ని రాష్ట్రంలోని ఫోటోగ్రాఫర్లను కూడా గుర్తించి తగిన రాయితీలు అందజేయాలని కోరారు. ఆధునిక టెక్నాలజీ రంగంలో ఫోటోగ్రఫీ రంగం స్మార్ట్‌ఫోన్‌లు మరియు సోషల్ మీడియా వల్ల తీవ్రమైన పోటీని ఎదుర్కొంటుందని, ఫోటోగ్రాఫర్లు ఈ సవాళ్లను అధిగమించాలంటే వెడ్డింగ్ ఫోటోగ్రఫీ, పర్సనలైజ్డ్ ఫోటో ప్రొడక్ట్స్, డ్రోన్ ఫోటోగ్రఫీ, ఏ ఐ టూల్స్ మరియు ఆన్‌లైన్ కోర్సుల ద్వారా నైపుణ్యత సాధించి. పోటీ తత్వాన్ని తట్టుకొని వృత్తిలో ముందుకు సాగాలిఅని సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులచే సీనియర్ ఫోటోగ్రాఫర్లకు సన్మానం పండ్రెడ్డి నటరాజ్, నెండ్రు జాషువా,ఆచారి,సాగర్ బాబును సన్మానించినారు. ఈ వేడుకల్లో పాల్గొన్న తెదేపా నాయకులు ఫోటోగ్రాఫర్స్ నూతన అధ్యక్ష,కార్య దర్శులుగా ఎన్నికైన వారిని అభినందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు వీరబత్తిన సుధా, కేకే బాబు, మైనార్టీ నాయకుడు హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో, సంఘ కార్యదర్శి సుకుమార్, ఉప కార్యదర్శి, రాజేష్ ఖన్నా, పిఆర్ఓ.కసగాల సుమంత్ బాలాజీ, కార్యవర్గ సభ్యులు పండ్రేడ్డి శివ, అయ్యప్ప, ట్రెజరర్ రామకృష్ణ, సీనియర్ ఫోటోగ్రాఫర్లు జాషువా, నటరాజు,ఎడ్వర్డ్,మోషే,సురేష్, పాల్గొన్నారు.

## మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ




**పెనుమంట్ర, మేజర్‌న్యూస్ :** మానవత ప్రెసిడెంట్ శిరం విశ్వనాథం ఆధ్వర్యంలో ప్రపంచ మానవత్వపు దినోత్సవం రోజున మానవత శాంతి ర్యాలీ బసంతి దేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మార్టేరు వద్ద నుండి ప్రారంభమై ర్యాలీగా మార్టేరు పురవీధుల్లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్త సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మానవత్వం అంటే నిర్ణయించిన రోజునో, తేదీనో చేసే పని కాదు. వారసత్వ విలువల వలన, సత్సాంగత్యం వలన మనకు లభించే అద్భుతమైన వరం, ప్రతి మనిషిలో మానవీయ విలువలు పెంపొందితే విశ్వశాంతి తథ్యం అని అన్నారు. రెండో ముఖ్య అతిథి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అత్యం నగేష్ మాట్లాడుతూ మానవత శాంతి ర్యాలీ ద్వారా త్యాగం, ఐక్యత, దేశభక్తి ప్రపంచానికి చాటి చెప్పి వసుదైక కుటుంబంగా ఉండి పర్యావరణ పరిరక్షణ కై పాటుపడుతూ ప్రపంచ శాంతి వర్ధిల్లాల్లి అని చెబుతూ, ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలి అని పిలుపునిచ్చారు, ప్రపంచ శాంతికై పాటుపడుతున్న మానవత బృందానికి ప్రత్యేక అభినందనలు అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పీడి పడాల శ్రీనివాసరెడ్డి, పడాల సువర్ణ గౌరి, బాణాల శ్రీనివాసరావు, సైకిల్ షాప్ కృష్ణారెడ్డి, కోణాల నర్సిరెడ్డి, పడాల రామచంద్ర రెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## 21న సీఐటీయూ మండల మహాసభ

**యలమంచిలి, మేజర్‌న్యూస్:** ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు స్థానికరైతు భవనంలో మండల మహాసభను నిర్వహించనున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ లో ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మహా సభకు ముఖ్య అతిథిగా రాజా రామ్మోహన్ రాయ్, జిల్లా కార్యదర్శి జె.శ్రీనివాస్, కార్యదర్శి వర్గ సభ్యులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్,ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనం కార్మికులు విద్యుత్, పంచాయతీల సిబ్బంది, పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, పొదుపు గ్రూప్ సి.ఎలు, భవన నిర్మాణ, ఒలుపు దింపు కార్మికులు, పెయింటర్స్ ఇంకా వివిధ వృత్తులకు సంబంధించిన కార్మికులంతా పాల్గొని మహాసభను జయప్రదం చేయవలసిందిగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ తెలిపారు.

## జాతీయ ఐక్యతా అవార్డ్ అందుకున్న డా.తిరువీధుల రాజరాజేశ్వరి




**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ నుండి నేషనల్ యూనిటీ అవార్డ్ (జాతీయ ఐక్యతా అవార్డ్) అందుకున్నారు, -2025 ను హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియం లో జరిగిన అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాలలో ఈ అవార్డ్ అందుకున్నారు.అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాల సభకు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ జాతీయ కార్యదర్శి డా ఉదయశ్రీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తెలంగాణ విధాన పరిషత్ మాజీ డిప్యూటి ఛైర్మన్ ,యంయల్‌సి డా బండ్ల ప్రకాష్ ,ఆత్మీయ అతిథులు గాయం యల్ సి మక్కన సింగ్ రాజ్ ఠకూర్,తెలంగాణ విధాన పరిషత్ సభ్యులు బొగ్గరపు దయానంద గుప్త,ప్రముఖ విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి హాజరయ్యారు.డా బండ్ల ప్రకాష్ మాట్లాడుతూ సామాజిక సేవారంగంలో తనదైన ముద్ర వేసిన డా. తిరువీధుల రాజరాజేశ్వరికి అవార్డ్ ప్రకటించటం చాలా ఆనందంగా ఉందన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరి పట్ల అనురాగాన్ని కురిపిస్తూ సమైక్యతా భావనతో మెలగటం నేటి కాలంలో చాలా అరుదుగా జరుగుతుందని కానీ రాజరాజేశ్వరి మేడం సమాజంలో అందరినీ కలుపుకుంటూ భావితరాలకు మార్గదర్శకంగా నిలిచిందని కొనియాడారు. కొంతమంది అవార్డులకోసం పరిగెడుతుం టారని కొంతమందికి కొరకు అవార్డులే వెతుకుంటూ వస్తాయని ఆ రెండవ కోవకు చెందిన వ్యక్తే రాజరాజేశ్వరని అభినందనలు తెలియజేస్తూ అవార్డ్‌ను ప్రధానం చేస్తున్నామన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాశ్వరికి అవార్డ్ రావటం పట్ల కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేసారు.

## సైబర్ క్రైమ్, శక్తి యాప్‌పై అవగాహన అవసరం

**- సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు**



**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్:**నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్స్ పై అవగాహన పెంపొందించుకొని శక్తి యాప్ ను అందరూ తమ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని గిరిజనులకు జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం స్వర్ణవారిగూడెంలోని ఆర్ అండర్ కాలనీ గిరిజన గ్రామానికి వెళ్లి గిరిజనులకు సైబర్ క్రైమ్స్ అంటే ఏమిటి దాని వలన జరిగే నష్టాలను వివరించారు. అలాగే శక్తి యాప్ వల్ల కలిగే ఉపయోగాలను వారికి వివరించారు. గంజాయి డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు. గ్రామంలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు సమస్య ఏదైనా ఉంటే తమకి ఫోన్ చేయాలని అన్నారు.వీరితోపాటు ఎస్సై వి.క్రాంతికుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ ఫోటోగ్రాఫి దినోత్సవం సందర్భంగా పితాని శ్రీనివాస్‌కి సన్మానం



**ఆచంట, మేజర్‌న్యూస్ :** ఆచంటలో ప్రపంచం ఫోటో గ్రాఫి దినోత్సవంను మంగళవారం ఆచంట ఏరియా ఫోటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ ఘనంగా నిర్వహించారు, ఫోటో గ్రాఫి సృష్టి కర్త లూయిస్ జాక్వస్ మండ్ డాగురే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు, అయన వేసిన బాటలో ఫోటో గ్రాఫర్లు ఉన్నారని యూనియన్ నాయకులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఒక సీనియర్ ఫోటోగ్రాఫర్ కి సన్మానం జరుపుతున్నామని ఆచంట ఏరియా మెంబర్ కొండేటి వరప్రసాద్ తెలిపారు, ములపర్రు ఎస్ బి స్టూడియో కి చెందిన పితాని శ్రీనివాస్ ను సన్మానించారు, ఈ కార్యక్రమంలో జి.లక్ష్మీశ్రీనివాస్, శర్మ, సుబ్రహ్మణ్యం, సాగరు, రాజ్ కమల్, గంగాధర్, నాగరాజు, చిన్ని, సుబ్బారావు, వైఎంకె, హరి, ఎస్.కె, బాలాజీ, సత్యనారాయణ, ఆర్కే, హేమ శ్రీను ఫోటోగ్రాఫర్ల పాల్గొన్నారు.

## కుళాయి బకాయిలు చెల్లించండి.. కమిషనర్



**నర్సాపురం,మేజర్‌న్యూస్:** పట్టణంలోని వ్యక్తిగత కుళాయి వినియోగదారులు వెంటనే మున్సిపాలిటీకి చెల్లించవలసిన పన్నులను చెల్లించాలని కమీషనర్ ఎం అంజయ్య కోరారు.

ఇంటి, ఖాళీస్థలాలు, వ్యక్తిగత కుళాయిలు పన్నులను చెల్లించడం ద్వారా మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఉపయోగపడతాయని అన్నారు.పట్టణ ప్రజలు గమనించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్:** ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 5,6,9 తరగతిలలో ఖాళీ సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు.మంగళవారం ఆయనకు ప్రకటనలో పేర్కొంటూ బర్రింకలపాడు గురుకుల పాఠశాల యందు 5వ తరగతి ఎస్టి - 30, ఎస్సీ-04, బిసి-02, ఓసి-02 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. 6 వ తరగతి ఎస్టికి అదనంగా 20 సీట్లు గురుకులం అధికారులు కేటాయించినట్లు తెలిపారు.

9వ తరగతిలో 10 సీట్లు ఖాళీలు కలవు.ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా బర్రింకలపాడు పాఠశాల కార్యాలయం నందు హాజరు కావాలని తెలిపారు.

# పోక్సో చట్టం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలి

## స్పెషల్ కోర్టుల పనితీరు మెరుగు పరచాలి : రోనాల్డ్ రాజు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** పోక్సో చట్టం దుర్వినియోగం, స్పెషల్ కోర్టుల పనితీరు మెరుగు కోసం ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యకులు గొట్టుముక్కల రోనాల్డ్ రాజు పంపిన ఫిర్యాదుకు ప్రధాన మంత్రి కార్యాలయం జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ స్పందించింది. ఆయన ఫిర్యాదును నిశితంగా పరిశీలించి తగుచర్య తీసుకోవాలని ఆదేశించారు. దీనిపైన స్పందించిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్‌కు ఫిర్యాదులో చేసిన పలు సూచనలను 14-08-2025గా నమోదు చేసి వాటిపై తగిన చర్యలు తీసుకొనబడతాయంటూ జాతీయ కమీషన్ తెలిపింది.

లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం- 2012 సంవత్సరంలో సమాజ శ్రేయస్సు గురించి చట్టం చేసి కఠినమైన శిక్షలను 3 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలకు పొందుపరచి చట్టాన్ని అమలుపరచడానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక,చట్టపరమైన నేర ప్రవృత్తిని భావించే ఏర్పాటు కూడా చేసారు. అయితే రాను రాను లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం-2012 చట్టం దుర్వినియోగం పెరిగిపోతుందని న్యాయవాది రోనాల్డ్ రాజు పేర్కొన్నారు. అనేక మంది యువకులు, విద్యార్థులు ప్రేమ వ్యవహారముల లో పడి ఊచలు లెక్కపెడుతున్నా రని, సమాజ శ్రేయస్సు కోరి చేసిన ఈ చట్టాన్ని ఈ మధ్య భార్య భర్తల తగువలకు కూడా తీసుకొచ్చి చట్టాన్ని దుర్వినియోగపరుస్తూ చట్టం మౌలిక ఉద్దేశ్యాన్ని నిర్వీర్యము చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గమనించిన పలు హై కోర్టులు పలు సందర్భాలలో ఈ చట్టాన్ని దుర్వినియోగ పరచకుండా చూడవలసినదిగా రక్షణ శాఖలకు ,ప్రత్యేక కోర్టులకు పలుసార్లు సూచనలు చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. కొన్ని ప్రత్యేక కోర్టులు చట్టపరమైన సాక్ష్యాలు ఉన్నా. లేకున్నా శిక్షలు వేయటమే పరమావధిగా పెట్టుకొని తీర్పులు చెప్పడముతో ఈ ప్రత్యేక చట్టము ఔన్నత్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు.

కొన్ని సందర్భాలలో నిజమైన బాధితులకు తగిన న్యాయము జరగడంలేదని,పోక్సో చట్టం ఈ విధంగా దుర్వినీయోగం అవుతుందని, వాటిలో లోపాలు సవరించ వలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ చట్టం వలన అమాయక యువత సంవత్సరాల కాలంగా కారాగార వాసానికి గురి అవ్వకుండా తగిన మార్పులు చేర్పులు చేసి ప్రత్యేక కోర్టులకు చట్టాన్ని అమలుచేసి భాగంగా ఊహాజనితము మీదుగా తీర్పులు ఇవ్వకుండా సాక్ష్యాధారాల ఆధరంగా తీర్పు ఇచ్చే విధంగా తగిన శిక్షణ ఇవ్వవలసి ఉందని సుప్రీమ్ కోర్టు వారు, పలు హై కోర్టులు ఈ చట్టం అమలు విషయములో ఇచ్చిన తీర్పులు అమలు చేయాలని రోనాల్డ్ రాజు పంపిన ఫిర్యాదులో కొరారు.అందుకు జాతీయ బాలల హక్కుల కమీషన్ తగిన చర్యలు తీసుకుంటామని లిఖిత పూర్వకంగా తెలిపింది.

# రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు

## - అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని ఆదేశం





**పెదవేగి,మేజర్ న్యూస్:** దెందులూరు నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేకుండా సమృద్ధిగా అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళ వారం ఉదయం పలువురు కూటమినాయకులు, కార్యకర్తలు,అధికారులు, ప్రజలు చింతమనేని ప్రభాకర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సత్వరమే వాటినే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులతో చింతమనేని మాట్లాడుతూ నియోజకవర్గ పరిధి, లోని రైతులకు ఎట్టి పరిస్థితుల్లో యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమృద్ధిగా యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పెదపాడు మండలంలో యూరియా కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని సత్వరమే రైతులకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా కొరత ఏర్పడి రైతులు అసౌకర్యానికి గురవుతున్న కూడా వారి సమస్యను పరిష్కరించ కుండా అధికారులు ఉదాసీనత వ్యవహరిస్తే అటువంటి చర్యలను ఉపేక్షించమని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.

# ప్రతి ఒక్కరికి కంటి చూపు ఎంతో ప్రధానం





**- ఆనంద ఫౌండేషన్ సేవలను అభినందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి**

**భీమవరం,మేజర్ న్యూస్ :** ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరం జె.పి.రోడ్ ఆనంద ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని, కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి కలెక్టర్ చేతులమీదుగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కంటి చూపు ఎంత ప్రధానమో, చూపు తగ్గిన వారు దాని నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా అంతే ముఖ్యం అన్నారు. తరిగిన కంటిచూపు తిరిగి పొందలేం అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మెరుగైన కంటి చూపు కోసం, కంటి చూపు తగ్గకుండా ఉండడం కోసం ఆకుకూరలు,పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు,కంటి వైద్యుల వద్ద తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకోని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ నిర్వాహకులు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కళ్ళజోళ్ళు పంపిణీకి ముందుకు వచ్చి అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలను అందించేందుకు చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథ్ రాజు,వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశి విశ్వనాథరాజు మాట్లాడుతూ జులై 17 తేదీన సుమారు 800 మందికి ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ , భీమవరం వివిఎస్ఎం ఐ హాస్పిటల్ సౌజన్యంతో భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్ నందు కంటి పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. కంటి చూపులో లోపాలున్నవారికి శస్త్ర చికిత్సలు చేయించడం జరిగిందని,అలాగే కళ్ళజోళ్ళు అవసరం అయిన 360 మందికి ఈరోజు కళ్ళజోళ్లను జిల్లా కలెక్టర్ ద్వారా పంపిణీ చేయడం జరుగుచున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ వి.రామరాజు, దాయన చంద్రాజి, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ రఘుపతి రాజు, ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## చించినాడ వంతెనకు కొనసాగుతున్న మరమ్మతులు





**యలమంచిలి,మేజర్‌న్యూస్ :** యలమంచిలి మండలం చించినాడ వద్ద వశిష్ఠ గోదావరి నదిపై నిర్మించిన వంతెనకు మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 21తేదీవరకు ట్రాఫిక్ నిలుపుదల ఆంక్షలు కొనసాగిస్తున్నట్లు సంబంధిత ఎన్.ఎచ్. అధికారులు తెలిపారు. గతంలో సాయంత్రం7 గంటల వరకు అనుమతిం చబడిన ట్రాఫిక్ బ్లాక్ వ్యవధిని రాత్రి 10 గంటల వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు, ప్రజలందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### - కొయ్యలగూడెం మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన





**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్ :** కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బిల్లిమిల్లి ,కనకాద్రి పురం ,గ్రామంలో 27 లక్షల నిధులతో నూతనంగా నిర్మించబోయే స్కూల్ భవనాలకు శాసనసభ్యులు చిర్రి బాలరాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో విద్య సదుపాయాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతోందని అన్నారు. విద్యార్థుల కు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించడంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకుంటారనిఅన్నారు. అనంతరం గ్రామంలోని కూటమి నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేను అభినందించారు. పరింపూడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి రహదారులను సుమారు కోటి రూపాయల వ్యయంతో సీసీ రోడ్లుగా అభివృద్ధిపరచమని తెలిపారు. మండల కేంద్రంలో విద్య, వైద్యం,వంటివి మౌలిక సదుపాయాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది అని తెలియజేశారు. ఎన్నడూ లేని విధంగా రోడ్లు నూతన భవనాలు డ్రైనేజీ వంటి నిర్మాణాలను అధికారంలోకి వచ్చిన వెంటనే కొయ్యలగూడెం అభివృద్ధికి పెద్ద పేట వేసి పనులను చేస్తున్నామని అన్నారు. అనంతరం జనసేన నాయకులు,వ్యవసాయ సహకార పరపతి సంఘనికి చైర్పర్సన్ దుగ్గిన శ్రీను ఇంటివద్ద బస చేశారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న దుగ్గిన శ్రీనుతో జన సైనికుల నడుమ గ్రామంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొని ప్రజలకు అభివాదం చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గానికి గడిచిన సంవత్సరకాలంలో 47 కోట్ల రూపాయలు డ్రైనేజీలు సిసి రోడ్లు నూతన భవనాలు వంటి భౌతిక సదుపాయాలకు విధులు సమకూర్చమని అన్నారు. ఎవరు ఎన్ని విధాలుగా ప్రయత్నం చేసినా పోలీస్ స్టేషన్ చుట్టూ కాంప్లెక్స్ ,అగ్నిమాపక కేంద్రం అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను ఆపలేరని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్ల మేఘలాదేవి,చింతల వెంకటరమణ, జేష్ట రామకృష్ణ, బొబ్బర చిన్ని రాజా,పలువురు పాల్గొన్నారు.

# భారీవర్షాల కారణంగా ముందస్తు చర్యలు తీసుకున్న కమిషనర్



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** వాతావరణశాఖ తెలియజేసిన ప్రకారము అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులు అధిక భారీవర్షాలు హెచ్చరికల నేపథ్యంలో తాడేపల్లిగూడెం పురపాలక సంఘం పరిధిలో ముందస్తు చర్యలు తీసుకొనుటకు గురించి సచివాలయ సిబ్బంది వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, వార్డు ఎమినిటీ సెక్రటరీలు, వార్డు శానిటరీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ విభాగము, టౌన్ ప్లానింగ్ విభాగము, పబ్లిక్ హెల్త్ విభాగము సిబ్బంది అందరితో మంగళవారం కమిషనర్ ఎం.ఏసు బాబు అధ్యక్షతన అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి భారీ వర్షాలు కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా,మురుగు కాలువలలో బ్లాక్లు లేకుండా వర్షపునీరు సజావుగా పారేటట్లుగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి మురుగు కాలువలలో ఏర్పడిన బ్లాక్ లను పీహెచ్ వర్కర్ల ద్వారా తొలగించవలసిందిగా సిబ్బందికి ఆదేశములు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా మోటార్ ద్వారా తొలగించుటకు తక్షణమే చర్యలు తీసు కొనవలసినదిగా ఆదేశించారు. కాలువలు మీద ఆక్రమణ చేసిన వారిని తొలగించవలసింది గాను ,పాడుబడిన భవనములను గుర్తించి వాటిని తొలగించుటకు నోటీసు లు జారీ చేయవలసిందిగా ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. కాలువలలో ఉన్నటువంటి నీటి సరఫరా పైపులను గుర్తించి వాటిని కాలువలలో లేకుండా రీప్లేస్ చేయించవలసిందిగా భవన యజమానులకు తక్షణమే నోటీసులు జారీ చేయవలసిందిగా 24 గంటలలో సదరు భవన యజమానులు రీప్లేస్ చేయనీ ఎడల సదరు పైపులను తక్షణమే డిస్కనెక్షన్ చేయించవలసినదిగా ఏమనిటీ సెక్రటరీ ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ జై వెంకటరమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారాం,మేనేజర్ ఎం రవి సుధాకర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వి జగదీశ్వరరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎన్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం సోమేశ్వరరావు, సచివాలయ సిబ్బంది హాజరైనారు.

# పొట్టిపాడులో రైలు ఢీకొని యువతి మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** రైలు పట్టాలు దాటుతున్న మహిళ ను ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఆమె ఘటన స్థలంలోనే మృతి చెందింది. ఈ ఘటన ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. మృతురాలు పొట్టిపాడు ప్రాంతానికి చెందిన చిక్కవరపు లక్ష్మి (30)గా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 23న భీమవరంలో 5 వేల ఉచిత వినాయక ప్రతిమలు పంపిణీ

**– బ్రోచర్,విగ్రహాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం,మేజర్ న్యూస్ :** ప్రజలందరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగ స్వాములు కావా లని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే అంజిబాబు నివాసంలో ఈనెల 23వ తేదీన భగవాన్ ప్లాజా వద్ద జైత్ర బిజ్ సొల్యూషన్స్ (భీమవరం డాట్ కామ్) అధ్వర్యంలో 5 వేల ఉచిత వినాయక ప్రతిమల పంపిణీ బ్రోచర్ విగ్రహ ప్రతిమను ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు. మట్టి వినాయకుడిని పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో 13 ఏళ్లుగా ఉచిత వినాయక ప్రతిమలను అందించడం అభినందనీయమని అన్నారు. ఈనెల 27న జరిగే వినాయక చవితి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. రసాయనాలతో చేసిన విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగంతో పర్యావరణానికి పెను నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రజలు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలతో జీవితాంతం బాధే



**నూజివీడు,మేజర్ న్యూస్ :** ప్రపంచ మత్తు పదార్థాల నివారణ కొరకు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఆదేశాల మేరకు, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ పర్యవేక్షణలో,నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ సిబ్బందితో కలిసి మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక షర్ట్ థామస్ హై స్కూల్ నందు మత్తు పదార్థాలు వలన శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే నష్టం, కుటుంబాల పతనం, నేరాలు, యువత భవిష్యత్తు నాశనం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ 'డ్రగ్స్ వినియోగం అనేది తాత్కాలిక మత్తే కానీ దీని ఫలితం జీవితాంతం బాధే అన్నారు. యువత తమ విలువైన జీవితాలను ఈ మత్తు పదార్థాలకు బలి చేయకూడదు. మత్తు పదార్థాలపై శాశ్వతంగా పోరాటం చేయాలంటే విద్యార్థిని విద్యార్థులు భాగస్వామ్యం అత్యవసరం అని పేర్కొన్నారు.

# ఎస్ఎఫ్ఎస్ స్కూల్ బస్సులను తనిఖీ చేసిన ఎస్ఐ,ఎంవిఐ



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాల పై నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి ఎస్ఐ శుభశేఖర్, ఏఎంవీఐ అన్నపూర్ణ తో సమన్వయంగా మంగళవారం వడ్లమాను గ్రామ శివారు ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్ బస్సుల ఫిట్నెస్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల భద్రత కోసం, బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు పాటించవలసిన జాగ్రత్తలు, నియమాలు,రహదారి భద్రతా చర్యలను వివరించారు. స్కూల్ బస్సులను సమయానుసారం ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందడం, వాహనాల్లో అవసరమైన భద్రతా పరికరాలు కలిగి ఉండడం, స్పీడ్ పరిమితిని కచ్చితంగా పాటించడం, చిన్నారుల ప్రాణభద్రతను అత్యంత ప్రాముఖ్యంగా పరిగణించడం, బస్సు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల వాహనాల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ శాఖ, మోటార్ వెహికిల్ శాఖ సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా, డ్రైవర్లలో రహదారి భద్రత పట్ల మరింత అవగాహన పెంపొందించడమే కాకుండా, విద్యార్థుల ప్రాణ భద్రతను కాపాడేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఉరివేసుకొని యువకుడి మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** వ్యక్తి ఉరివేసు కొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన స్థానిక శ్రీరామ్ నగర్ 12వ రోడ్డులో మంగళ వారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. శ్రీరామ్ నగర్లో ఉన్న సూపర్ బజార్లో గుమస్తాగా పనిచేస్తున్న బోను సతీష్ (38) భార్య ఇద్దరు కుమార్తెలతో జీవిస్తున్నాడు. అతను ఇంటి వద్దనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆసుపత్రికి తరలిస్తే అప్పటికే మృతి చెందాడని,అప్పుల బాధ భరించలేక ఈ విధంగా చేశాడని భార్య సుధ తెలిపారు.

## భర్తతో గొడవపడి పిల్లలతో అదృశ్యమైన భార్య





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** భర్తతో గొడవపడి ఇద్దరు పిల్లలతో భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన సనక రవీంద్ర భార్య లక్ష్మిశిరీషలకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. పలుసార్లు భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరగడం ఆమె పుట్టింటికి వెళ్లడం జరుగుతోంది. ఈ నెల 15న మరోసారి ఇద్దరు గొడవపడి భార్య శిరీష ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్ళింది.ఆమె ఆచూకీ తెలియక పోవడంతో రవీంద్ర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై వి ఎస్ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తతతో ఉండాలి

**– అధికారులకు జేసి ధాత్రిరెడ్డి ఆదేశం**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిలాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఎటువంటి నష్టం కలగకుండా తీసుకోవలసిన చర్యలపై స్థానిక కలెక్టరేట్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఎక్కువ అవుతున్న దృష్ట్యా జిల్లాలో గోదావరి ముంపు ప్రమాద ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

గోదావరి నదికి మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటించేలోపుగానే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీకి ముందుగానే అధికారులు సహాయక చర్యలకు సిద్ధం కావాలని,ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రమాద ప్రాంతాలలోని గర్భిణీలు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రసవానికి సిద్ధంగా ఉన్న గర్భిణీలను దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు.

ముంపు ప్రమాద మండలాలకు చెందిన ప్రజలను గోదావరి తీర ప్రాంతంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన వెంటనే ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు





**– రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జాతీయ రహదారిపై నివారించదగినది, నివారించలేని వాహన ప్రమాదాలకు ఆస్కారంవున్న ప్రాంతాలను గుర్తించి నివేదిక సమర్పించాలని ఆర్ అండ్ బి,పోలీస్, నేషనల్ హైవే, రవాణా శాఖాధికారులతో కూడిన సబ్ కమిటీని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నివారించదగిన రోడ్డు ప్రమాదాలపై దృష్టిసారించి అందుకు అవసమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భధ్రతా చర్యలను ముమ్మరం చేయడంతోపాటు భధ్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలోని కలపర్రు నుంచి గుండుగొలను వరకుగల జాతీయ రహదారిపై అనుమతులు లేకుండా ఏర్పాటుచేసిన దాబా,హెూటల్స్,ఇతర శాశ్వత, తాత్కాలిక నిర్మాణాలు రోడ్డు భధ్రత,ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించాలని ఏలూరు ఆర్డిఓను కలెక్టర్ ఆదేశించారు. వీటిలో 6 బ్లాక్ స్పాట్స్‌లో తీసుకోవల్సిన చర్యలను 10 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్ టి సి బస్సులు ప్రమాదాలకు గురికాకుండా బస్సులన్నింటి ఫిట్ నెస్ తనిఖీలు నిర్వహించాలని ఆర్ టి సి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆశ్రం హాస్పటల్ వద్ద గల హైవే బ్రిడ్జి కింద విద్యుత్ లైట్లు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 108 వాహనాలతోపాటు ఎన్‌హెచ్‌కి సంబంధించి ఉన్న అంబులెన్సులు అందు బాటులో ఉండటంతోపాటు సంబంధిత అన్ని ఫోన్ నెంబర్లు పనిచేస్తున్నదీ లేనిది పరిశీలించాలన్నారు. పాఠశాలలకు జాతీయ రహదారి దాటివెళ్లే విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ఆయా ప్రాంతాల్లో స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటుచేసి వాహన వేగాన్ని నియంత్రణ చేయాలన్నారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు,ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజారత్నం, రవాణా శాఖ ఉప కమీషనర్ కరీం,ఆర్డిఓ ఎం.అత్యుత అంబరీష్, ఆర్టీవో కృష్ణారావు,జిల్లా ప్రజా రవాణా అధికారి షేక్ షబ్నం,డిఇఓ ఎం.వెంకట లక్ష్మమ్మ, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్ కుమార్, ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.రాజీవ్, ఆర్ఐఓ యోహాన్,జాతీయ రహదారుల సంస్థ అధికారులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 20 నుండి కోర్ట్‌లలో వివిధ పోస్టుల అభ్యర్థులకు పరీక్షలు

**– హాల్ టికెట్ తోపాటు గుర్తింపు కార్డు తీసుకురావాలి : జిల్లా జడ్జి శ్రీదేవి**



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోర్ట లలో వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా జడ్జ ఎస్. శ్రీదేవి చెప్పారు. స్థానిక జిల్లా జడ్జ ఛాంబర్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణ వివరాలు పాత్రికేయుల సమావేశంలో తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జ శ్రీదేవి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ కోర్ట్ లలో స్టెనోగ్రాఫర్స్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్, తదితర పోస్టులకు జారీ చేసిన నోటిఫికేషన్ కు 4207 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసారని, వీరికి ఈ నెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఉభయ గోదావరి జిల్లాలోని 3 కేంద్రాలలో ఏలూరులోని సి.ఆర్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీ, సిద్దార్థ క్వెస్ట్ కళాశాల, భీమవరంలోని డి. ఎన్ .ఆర్. కళాశాలలో కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నామన్నారు.పరీక్ష ఆన్లైన్ విధానంలో ఉంటుందని, ఈనెల 20, 21,22,24 తేదీలలో మూడు షిఫ్టులలో, 23వతేదీన రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను నిర్దేశించిన సమయానికి 15 ని.ల ముందు వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోని అనుమతించడం జరుగుతుందన్నారు.అభ్యర్థులు సదరు విషయాన్ని పరిశీలించి పరీక్షా సమయానికి 15ని.ల ముందుగానే పరీక్షా కేంద్రంలోనికి చేరుకోవాల న్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటుగా తప్పనిసరిగా ఫోటో గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు.స్టెనోగ్రాఫేర్ గ్రేడ్-3, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్ పోస్టులకు కంప్యూటర్ పరీక్షలతో పాటు నైపుణ్యం పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులకు వారి విజ్ఞప్తి మేరకు స్క్రైబ్ ని ఏర్పాటుచేయడం జరుగుతుందని, వారిని నిర్దేశించిన సమయం కన్నా 30 ని.లు అదనపు సమయం ఇవ్వడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్ డౌన్లోడ్‌లో సాంకేతిక సమస్యలు, తదితర సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థుల కోసం 0863-2372 752 ఫోన్ నెంబర్‌తో హెల్ప్ లైన్ ఏర్పాటుచేయడం జరిగిందని, %helpdesk.hc.ap.aij.gov.in% మెయిల్‌కి తెలియజేవ చ్చున్నారు. పరీక్షల కేంద్రాలకు అవసరమైన రవాణా సౌక ర్యాలు ఏర్పాటుచేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. విలేకర్ల సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్, ప్రభృతులు పాల్గొన్నారు.

# పోలవరం ఆర్ అండ్ ఆర్ భూ సేకరణ పనులు పూర్తి చేయాలి

**– గ్రామ సభలు నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**




**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కోసం అమలు చేస్తున్న ఆర్ అండ్‌ఆర్ పనులకు సంబంధించి భూ సేకరణను వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్ నుండి పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ భూ సేకరణ, జాతీయ రహదారుల భూసేకరణ, తదితర అంశాలపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తమ భూములు అందించిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి లో భాగంగా భూమికి భూమి, ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణం,తదితర పనులకు గాను ఏలూరు జిల్లాలో మిగిలిఉన్న భూసేకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని, తాడిపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణ కూడా పూర్తిచేయాలన్నారు.బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాలలో భూసేకరణ కు అవసరమైన భూమిని వెంటనే గుర్తించాలన్నారు. భూసేకరణ కోసం భూమిని గుర్తించిన తర్వాత ఆయా గ్రామాలలో రైతులతో ఆర్డీవో, డిఎస్పి అధికారులు చర్చించి వారి సమక్షంలో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న,ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటిడిఏ అపూర్వ భరత్, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, స్పెషల్ కలెక్టరు యస్.సరళ వందనం,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్లకు ఎమ్మెల్యే రాధాకృష్ణ శుభాకాంక్షలు



**తణుకు,మేజర్ న్యూస్ :** ఒక్క ఫోటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలను కదలాడించే విధంగా అద్భుత సన్నివేశాలను బంధించే ఫోటోగ్రాఫర్లకు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తణుకు నియోజకవర్గంలోని ఫొటో, వీడియో గ్రాఫర్లతోపాటు జర్నలిస్టులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే వెనక్కు వెళ్లి ఏళ్లనాటి మధురస్మృతులను మనసులో మెదులుతూ ఉంటాయన్నారు.కాలానుగుణంగా టెక్నాలజీను అందిపుచ్చుకుంటూ మార్పులను పదిలంగా దాచుకుని వళ్లీ మళ్లీ చూసుకునే అవకాశం ఒక్క ఫోటోతోనే సాధ్యమవుతుంని ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

## ప.గో.జిల్లా డిఆర్‌ఓవెంకటేశ్వర్లు ఐఏఎస్‌కు ఎంపిక

**– అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్,జేసి,అధికారులు**



**భీమవరం,మేజర్ న్యూస్ :** డిఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు ను కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. భారత ప్రభుత్వం మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ పబ్లిక్ గ్రీవెన్సెస్,పెన్షన్లు సిబ్బంది అండ్ శిక్షణ విభాగం అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ చౌరాసియా మొగిలి వెంకటేశ్వర్లు ను ఆంధ్రప్రదేశ్ క్యాడర్ కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ప్రకటిస్తూ ఆగస్టు 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది.ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ నిబంధనలలోని నియమం 8(1) ద్వారా ఇవ్వబడిన నిబంధనలు 1954 అధికారాలను వినియోగించి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ కు 2023 సెలక్షన్ లిస్ట్ కు ప్రమోషన్ ద్వారా నియామకం చేపట్టడం జరిగింది నోటిఫికేషన్ లో ప్రకటించారు.మొగిలి వెంకటేశ్వర్లు పూర్వం గుంటూరు జిల్లా, ప్రస్తుతం పల్నాడు జిల్లా పెట్లూరివారిపాలెం నందు 1976 మే 20 జన్మించినారు. 1996 అక్టోబర్ 17న వ్యవసాయ శాఖలో సబార్డినేట్ సర్వీస్‌లో ఉద్యోగంలో జాయిన్ అయిన వీరు, 2002లో ఏపీపీఎస్సీ గ్రూప్ 2 సర్వీస్ కు సెలెక్ట్ అయ్యి ఏపీ సెక్రటేరియట్లో టిసీఏగా నియామకం కాబడ్డారు. అనంతరం 2004లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా, 2008 నుండి 2011 వరకు ఇంధన శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతిపై పనిచేశారు. 2011లో డిప్యూటీ కలెక్టర్ గా పదోన్నతి పొంది, 2014 నుండి 2019 వరకు ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో డిప్యూటీ సెక్రటరీగా పని చేశారు.అనంతరం 2019లో తాడేపల్లి లోని ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ నందు జాయింట్ సెక్రటరీగా పని చేశారు.2019 జులై నుండి 2020 మార్చి వరకు నరసరావుపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా, 2020 ఏప్రిల్ నుండి 2023 సెప్టెంబర్ వరకు, 2023 అక్టోబర్ నుండి 2024 ఫిబ్రవరి వరకు, 2024 ఫిబ్రవరి నుండి 2024 అక్టోబర్ వరకు కృష్ణా, ఏలూరు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలలో జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేశారు. అనంతరం 2024 అక్టోబర్ నుండి పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ ఈ నెల ఆగస్టు 18న ఆంధ్రప్రదేశ్ క్యాడర్ కు కన్ఫర్డ్ ఐఏఎస్ గా పదోన్నతి పొందారు.

# ఆక్వా పరిశ్రమను ఆదుకోవాలి



– మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేసిన ఎస్ఇఏఐ ప్రతినిధులు

న్యూఢిల్లీ/ భీమవరం,మేజర్ న్యూస్ : భారత సముద్ర ఆహార ఎగుమతుల సంఘం ప్రతినిధులు ఢిల్లీలో మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆక్వా పరిశ్రమను ఆదుకోవటానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు శ్రీ సానా సతీష్ బాబు,లావు శ్రీకృష్ణ దేవరాయలు, బీద మస్తాన్ రావులు కూడా హాజరై, సంఘ ప్రతినిధులతో కలిసి మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం అందజేశారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల భారత సముద్ర ఆహార ఎగుమతులపై 25శాతం టారిఫ్ విధించడంతో, ఎగుమతి రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని, ప్రస్తుతం అమెరికా భారతదేశానికి అతిపెద్ద మార్కెట్ కాగా, సంవత్సరానికి 8 బిలియన్ అమెరికా డాలర్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయి వారు తెలిపారు.ఇందుకోసం ప్రత్యేక ఆర్థిక సాయం,వడ్డీ రాయితీలు, వర్కింగ్ క్యాపిటల్ సపోర్ట్,టాక్స్ కన్సెషన్స్ వంటి ఉపశమన చర్యలు కేంద్రం అమలు చేసేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ,ఆంధ్రప్రదేశ్ ఆక్వా పరిశ్రమ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళ్లి, తగిన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భారత సముద్ర ఆహార ఎగుమతిదారుల సంఘం అధ్యక్షులు పవన్ కుమార్, సిఇఒ డాక్టర్ రాఘవన్, జాతీయ కమిటీ సభ్యుడు గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వంలో రైతే రాజు

జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్



జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్: ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారాధ్యంలో రైతు రాజుగా ఎదుగుతున్నాడని సంక్షేమ పథకాలు వంద శాతం అమలవుతున్నాయని జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు అధ్యక్షతన కొయ్యలగూడెం సొసైటీ అధ్యక్ష ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయిల్ ఫామ్ రైతులకు ధర పెంచిందని, టుబాకో రైతులకు అత్యధిక ధరించిన ప్రభుత్వంగా ఎన్డీఏ నిలిచిపోయిందని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో జాతీయ రహదారుల అభివృద్ధి, భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్ మంజూరయ్యాయి అని గుర్తు చేశారు. పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు నాయకత్వంలో ప్రతి గ్రామం సంక్షేమం అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. యువకుడు శాసన సభ్యులుగా ఉంటే నియోజకవర్గం ఎంత అభివృద్ధి చెందుతుందో బాలరాజును చూస్తే అర్థమవుతుందని అన్నారు.రాష్ట్రంలోనే పోలవరం నియోజకవర్గం అభివృద్ధిలో ముందుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలరాజు నాయకత్వంలో రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మి నరసింహ స్వామి పవిత్రోత్సవాలు



ద్వారక తిరుమల,మేజర్ న్యూస్: చిన్న వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన సుందరగిరిపై స్వయం వ్యక్తుగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమై మూడు రోజులు దివ్య పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏటా ఇక్కడ కళ్యాణోత్సవాలు, శివరాత్రికి సుదర్శన హోమాన్ని, నిర్వహించడం పరిపాటి. శ్రీ విశ్వనాథ సంవత్సర శ్రావణ బహుడ ఏకాదశి నుండి పవిత్రోత్సవాలు జరిపేందుకు దేవస్థానం నిర్ణయించింది. మంగళవారం ఉదయం మహాగణపతి పూజ,పుణ్యా హవచన, రుత్విగ్వరణ, దీపా రాధన,మండపారాధన, అంకురార్పణ,అధివాసాలు, నీరాజన,మంత్రపుష్పాలు,తో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఆలయ ఏఈఓ రమణ రాజు,సూపరింటెండెంట్ నగేష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దారిదోపిడికి పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్

– రూ.3లక్షల 15 వేల విలువగల గల బంగారు వస్తువులు స్వాధీనం



తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ : జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో, ఒంటరిగా బస్సు కోసం వేచి చూసే వారిని కిరాయి తీసుకుని డ్రాప్ చేస్తామని నమ్మించి దారి దోపిడికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 3,15వేల రూపాయల విలువగల గల బంగారు వస్తువులు స్వాధీన పరచుకున్న తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు. పెంటపాడు బీసీ కాలనీకి చెందిన కోట జగదీష్ అలియాస్ రూతమ్మ 26 తణుకు మండలం ముద్దాపురం గ్రామంకు చెందిన యల్లా సంతోష్ అలియాస్ బన్ని 20, గణపవరం మండలం మొయ్యేరు గ్రామంకు చెందిన అంద్రు హర్ష కుమార్ 24 ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్లో బస్ స్టాప్ వద్ద బంధకవి మేధా వెంకట సుబ్రహ్మణ్య శర్మ 54 బస్సు కోసం వేచి ఉండగా ఈ ముగ్గురు కార్ పై వచ్చి కిరాయి తీసుకుని డ్రాప్ చేస్తామని నమ్మించి తీసుకెళ్లారు. కొంత దూరం వెళ్ళిన తర్వాత వాహనం ఆపి, అతనిపై దాడి చేసి రూ.3500 నగదు,లాకెట్ తో కూడిన చైను, షిరిడీ సాయిబాబు ప్రతిమ గల ఉంగరం, వెంకటేశ్వరస్వామి ప్రతిమ గలా ఉంగరము,తెల్ల స్టోన్ (వైఢూర్యం) ఉన్న ఉంగరము అపహరించారు. ఇదే విషయమై తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా దానిపై విచారణ జరిపిన పోలీసులు నేరస్తులను అదుపులోకి తీసుకొని వారి నుండి 3 లక్షల 15 వేల రూపాయలు విలువగల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. తెలుపు రంగు షిఫ్ట్ డిజైర్ ఏపీ 39 యు జెడ్ 6564 గల కారు,నేరం చేయుటకు ఉపయోగించిన నల్లటి రంగు పిడి కలిగిన చాకు స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి బి విశ్వనాథ్ పత్రికా సమావేశంలో వెల్లడించారు. వీరిని మంగళవారం సాయంత్రం ముగ్గురు నిందితులను తాడేపల్లిగూడెం రైల్వే ట్రాక్ పక్కన వాసవి కాలేజీకి చెందిన ఖాళీ స్థలం వద్ద అరెస్ట్ చేశామని,వారి వద్ద నుండి దొంగిలించబడిన సుమారు రూ. 3లక్షల15వేల విలువగల బంగారు వస్తువులను స్వాధీన పరుచుకున్నట్లు డీఎస్పీ విశ్వనాథ్ తెలియజేశారు. కేసు దర్యాప్తు, రికవరీలో ప్రతిభ కనపర్చిన పట్టణ ఇన్స్పెక్టర్ బి. ఆది ప్రసాద్, ఎస్సైలు పి. నాగరాజు, బాదం శ్రీనివాసులను,సిబ్బందిని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, సబ్ డివిజన్ డిఎస్పి డి. విశ్వనాథ్ అభినందించారు.

## కమ్యూనిటీ భవనానికి నిధులు ఇవ్వండి



కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ : స్థానిక బాబు జగజీవన్ రామ్ కాలనీలో ఉన్న సుమారు 20 సెంట్లు భూమిలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించాలని శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు బాబు జగజీవన్ రామ్ యూత్ అధ్యక్షుడు బొబ్బర చిట్టిబాబు వినతి పత్రాన్ని అందజేశారు. శాసన సభ్యులతో చిట్టిబాబు మాట్లాడుతూ తమ కాలనీలోని ఏవైనా ఫంక్షన్ లు చేసుకోవాలన్న, క్రిస్మస్ పండుగ సమయాలలో యూత్ క్రిస్మస్ చేసుకోవాలన్న ఇబ్బంది పడుతున్నామని, పూర్వం పెద్దల నుంచి ఆనవాయితీగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ స్థలం ఖాళీగా ఉందని ఆ స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు.శాసనసభ్యులు బాలరాజు స్పందిస్తూ తప్పనిసరిగా కమ్యూనిటీ భవనాన్ని నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, పాత కాకుల రత్నరాజు, పులపాకుల దుర్గారావు, పురిటిగడ్డ వెంకటేష్, గులిశెట్టి శ్రీనివాస్,మేడిన కన్నయ్య, జనసైనికులు ఉన్నారు.

## దుగ్గిరాల బాలరావమ్మతల్లి దేవస్థాన చైర్మన్‌గా మండవ ప్రమాణ స్వీకారం



ఆగిరిపల్లి,మేజర్ న్యూస్: మండల పరిధి తోటపల్లి గ్రామంలో కొలువైయున్న శ్రీశ్రీశ్రీ దుగ్గిరాల బాలరావమ్మ తల్లి దేవస్థాన చైర్మన్ గా మండవ రామకృష్ణ ప్రసాద్ బుధవారం గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయున్నట్లు గ్రామ సర్పంచ్, నూజివీడు నియోజకవర్గ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆగిరి పల్లి మండల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు,కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు దుగ్గిరాల బాలరావమ్మ తల్లి దేవాలయానికి విచ్చేసి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనవలసినదిగా కోరారు.కావున మా ఆహ్వానాన్ని అంగీకరించి గుడి వద్ద ప్రమాణ స్వీకారానికి హాజరై, అమ్మవారి ఆశీస్సులు, తీర్థ అన్న ప్రసాదలను స్వీకరించవలసిందిగా కోరారు.

# సిపిఐ జిల్లా మహాసభలకు బయలు దేరిన పార్టీ శ్రేణులు




తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ : సిపిఐ పశ్చిమ గోదావరి 27వ జిల్లా మహా సభలు సందర్భంగా ఈరోజు తణుకు పట్టణం లో జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభ కార్య క్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ పాల్గొంటారని రాష్ట్ర సహాయ కార్య దర్శి ముప్పాలా నాగేశ్వరావు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు తాటిపాక. మధు,రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కే.వెంకటరావు,జిల్లా కార్య దర్శి కొనాల భీమరావు, నెక్కంటి సుబ్బారావు పాల్గొంటారు అని అన్నారు. 20వ తేదీ బుధవారం వంక సత్యనారాయణ సూరాజ్య భవన్‌లో ప్రతినిధుల సభ జరుగుతుంది అని అన్నారు. పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరావు మాట్లాడుతు ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలు ఎన్నికలో యిచ్చిన హామీలు అమలు, విశాఖ ఉక్కు పరిరక్షణ, అనేక సమస్యలు పై పోరాట కార్య చరణ రూపొందించ నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం నుండి సిపిఐ నాయకులు బయలు దేరారు.